www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 28 | | 3-7-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## యూజర్‌నేమ్‌పై వాట్సాప్ క్లారిటీ



- ఇంకా అమల్లోకి రాలేదు.. దశలవారీగా అందుబాటులోకి
- యూజర్‌నేమ్ ఉన్నా మొబైల్ నంబర్ తప్పనిసరే
- కేంద్రం ఆందోళనలకు మెటా సంస్థ వివరణ

4

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం




అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్‌లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది.

4

## జపాన్ ప్రధాని నా అందమైన చెల్లెలు



- మోదీ ఆప్యాయతకు తకాయిచీ ఫిదా
- భారత్-జపాన్ బంధానికి కొత్త ఊపు
- రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- ఫార్మా, రక్షణ, కృత్రిమ మేధస్సు రంగాల్లో కీలక ఒప్పందాలు

4

## మూసీ తొలి దశకు గ్రీన్ సిగ్నల్

### కొత్త చట్టాలపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం

- టీచర్లకూ ఇక మధ్యాహ్న భోజన సదుపాయం
- ఆసుపత్రుల్లో 6278 వైద్య పోస్టుల మంజూరు
- కేబినెట్ కీలక నిర్ణయాలు!

వివరాలు 3లో..



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తొలి దశ పనులతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పోస్టుల మంజూరు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం లాంటి విశేష అంశాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

## కవిత అరెస్టు

### ఉప్పల్‌లో ఉద్రిక్తంగా మారిన భూపోరాటం

బోడుప్పల్‌లో టీఆర్ఎస్ అధ్యక్షురాలి అడ్డగింత







## గురుకుల టెండర్లపై తీవ్ర దుమారం

# రణరంగం

### చర్చకు సిద్ధమైన ముగ్గురు మంత్రులు ..అమరవీరుల స్తూపం వద్ద ఎదురుచూపులు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు
- కత్తులు దూసిన అధికార, ప్రతిపక్షాలు
- వేడెక్కిన రాజకీయాలు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నిరీక్షణ
- తోపులాటలో కిందపడ్డ హరీశ్ రావు.. దారిలోనే అరెస్టు
- పోలీసులతో బీఆర్ఎస్ శ్రేణుల వాగ్వాదం
- తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన పరిణామాలు
- నగరంలో భారీగా పోలీసుల మోహరింపు
- చర్చల పేరిట భగ్గుమన్న రాజకీయాలు

సవాళ్లు.. ప్రతిసవాళ్లు.. ఆపై పోలీసుల అడ్డగింపులు.. అరెస్టులతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా రణరంగాన్ని తలపించాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కాస్తా ఏకంగా ముఖాముఖి తేల్చుకునే స్థాయికి చేరడంతో గురువారం హైదరాబాద్ మహానగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ వైఫల్యాలు, గురుకుల టెండర్లలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచాయి. దమ్ముంటే ఆధారాలతో చర్చకు రావాలంటూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సవాల్ విసిరిన కేటీఆర్.. తెలంగాణ భవన్‌లో ఆయన కోసం ప్రత్యేకంగా కుర్చీ వేసి మరీ నిరీక్షించారు. మరోవైపు గన్ పార్కు వద్దకు చర్చకు రావాలన్న 3 మంత్రుల సవాల్‌ను స్వీకరించి ధీమాగా బయలుదేరిన హరీశ్ రావును పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరగడం, హరీశ్ రావు కిందపడిపోవడం, ఆ వెంటనే ఆయనను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లడంతో నగరంలో ఒక్కసారిగా హైడ్రామా నెలకొంది.

వివరాలు 2వ పేజీలో

## నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోం

- పిరికివాళ్లం కాదు.. ఎవరితోపడితే వారితో చర్చించం
- ఆధారాలతో చర్చకు రావాలి
- అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తాం
- కేసీఆర్ లాగా టెండర్లు ఇవ్వలేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

2



## చేతగానోళ్లు ఎందుకు సవాళ్లు చేయాలి

బీఆర్ఎస్‌తో చర్చకు కాంగ్రెస్ కు భయం: కేటీఆర్



- పారిపోయిన సీఎం, మంత్రులు!
- తోక ముడిచిన మంత్రి జూపల్లి
- అరెస్టులు చేయించడం దుర్మార్గం
- గన్ పార్క్ వద్ద తొడలు కొడతారా.. దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి!

2

## కిరీటం దొంగల అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ

3

- బాసర ఆలయ చోరీ కేసు.. అంతర్ రాష్ట్ర దొంగల పట్టివేత
- నాందేడ్ వెళుతుండగా నిందితుల అరెస్టు.. కిరీటం, పట్టీ స్వాధీనం






3

## కళ్లుచెదిరే అక్రమాస్తులు

- ఏసీబీ వలలో డీఎస్పీ భీమ్‌రెడ్డి
- 16 చోట్ల ఏకకాలంలో సోదాలు
- 200 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

...వివరాలు 3లో

## స్మగ్లర్స్ న్యూ ప్లాన్

### స్పీడ్ పోస్టులో గంజాయి డెలివరీ

21 రాష్ట్రాలకు డ్రగ్స్ సరఫరా

3

- పార్శిల్స్‌లో మందుల పేరిట రవాణా
- ముఠాను అరెస్టు చేసిన పోలీసులు..
- వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్



## మంత్రివర్గ భేటీకి సురేఖ దూరం

- ట్రస్ట్ బోర్డుపై తీవ్ర అసంతృప్తి
- విదేశీ పర్యటన నుంచి వచ్చినా.. తన అభిప్రాయం తీసుకోలేదని ఆవేదన



3

## జర్నలిస్ట్ కేవీఆర్‌కు 14 రోజుల రిమాండ్

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
3 జూలై 2026

# కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు

**బీఆర్ఎస్ ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పులు చేసింది**

**నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామాకు సిద్ధం : మంత్రి జూపల్లి**



**హైదరాబాద్, జూలై 2 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. గత ప్రభుత్వం 7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. తాము అప్పులు చేయలేదని మాజీ సీఎం కేసీఆర్ చెప్పాలని జూపల్లి డిమాండ్ చేశారు. తాను చెప్పింది అబద్ధమైతే రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కార్పొరేషన్ల పేరుతో అప్పులు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారని, అది నిజమో కాదో చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి ఎలా తీరుస్తారని, ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి 20 లక్షలు వసూలు చేస్తారా అని నిలదీశారు. తాము చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. తన వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తానని, చర్చకు రావాలని జూపల్లి డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు 6 వేల కోట్ల వడ్డీ కడుతున్నామని వివరించారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని తెలిపారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

# గూండాయిజం సాగదు!

**బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదు**

**టెండర్ విలువే తక్కువ..ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుంది**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, జూలై 2 :** బీఆర్ఎస్ గూండాయిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమలో బీఆర్ఎస్ నేతలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పొంగులేటి మండిపడ్డారు. బీఆర్ఎస్ తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టెండర్ విలువ కంటే ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఇలాగే ప్రవర్తిస్తే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు. ఆ పార్టీ సవాల్‌ను స్వీకరించి మంత్రులు చర్చలకు వెళ్లారని, కానీ బీఆర్ఎస్ నేతలే రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చకు సిద్ధమేనని పొంగులేటి సవాల్ విసిరారు.

# ఎలాంటి విమర్శలకైనా సమాధానం చెబుతాం

**బహిరంగ చర్చకు సిద్ధమైన మంత్రులు**

**బీఆర్ఎస్ నేతలు తప్పించుకుంటున్నారు: ఎమ్మెల్యే దానం నాగేందర్**

**హైదరాబాద్, జూలై 2 :** కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉందన్నారని.. అందుకే వారు బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. మంత్రులు పూర్తిగా పారదర్శకంగా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్ గన్ పార్క్ వద్ద దానం నాగేందర్ మాట్లాడారు. తాము తప్పు చేయలేదన్న నమ్మకంతోనే మంత్రులు ప్రజల ముందుకు వచ్చి చర్చకు సిద్ధమయ్యారని చెప్పారు. అలాగే హరీశ్ రావు అండ్ కోను చర్చకు రావాలని కోరితే వారు తప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విమర్శలకైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని దానం నాగేందర్ స్పష్టం చేశారు. గురుకులాలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు ముందుకు వచ్చారని తెలిపారు. కాగా, గురుకులాల నిర్వహణ, అవినీతి ఆరోపణల అంశంపై రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అలీ షబ్బీర్ బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావుతో పలు అంశాలపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రకటించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులు తొలుత అసెంబ్లీకి బయలుదేరారు. అనంతరం గన్ పార్క్ వద్దకు చేరుకుని తమ సన్నద్ధతను ప్రకటించారు. గురుకులాల వ్యవహారంలో తమ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, అవినీతి ఆరోపణలపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని మంత్రులు స్పష్టం చేశారు



# రాజకీయ రణరంగం!

- గురుకుల టెండర్లపై తీవ్ర దుమారం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు
- కత్తులు దూసిన అధికార, ప్రతిపక్షాలు
- వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ నిరీక్షణ
- చర్చకు సిద్ధమైన ముగ్గురు మంత్రులు ..అమరవీరుల స్తూపం వద్ద ఎదురుచూపులు
- తోపులాటలో కిందపడ్డ హరీశ్ రావు.. అరెస్టు
- నగరంలో భారీగా పోలీసుల మోహరింపు



**హైదరాబాద్, జూలై 2 :** రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా కాక రేగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గన్ పార్కు వద్ద చర్చకు రావాలన్న మంత్రుల సవాల్‌ను స్వీకరించి వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్ రావును పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేయడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో సహా పక్కాగా వివరిస్తానని, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. దీనిపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ.. తాను ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌కు వస్తానని ప్రతి సవాల్ విసిరారు. దీంతో మంత్రి కోసం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా కుర్చీ వేసి కేటీఆర్ ఎదురుచూశారు. దమ్ముంటే చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు గురుకుల టెండర్లలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో చర్చకు రావాలంటూ 3 మంత్రులు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి హరీశ్ రావు.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్ పార్కుకు బయలుదేరారు. కానీ పోలీసులు వారిని తెలంగాణ భవన్ వద్దే అడ్డుకున్నారు. మంత్రులు రమ్మంటేనే తాము వెళ్తున్నామని, ఎందుకు ఆపుతున్నారని పోలీసులను హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కారు దిగి కాలినడకన వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించగా తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆయన కిందపడిపోయారు. వెంటనే హరీశ్ రావుతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. గురుకుల టెండర్లపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు గన్ పార్కుకు చేరుకుని అమరవీరుల స్తూపం దగ్గర కూర్చున్నారు. వీరికి మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా అక్కడికి వచ్చారు. ప్రభుత్వమే పోలీసులను అడ్డుపెట్టుకుని చర్చకు రాకుండా పారిపోయిందని, అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారని ఈ సందర్భంగా హరీశ్ రావు మండిపడ్డారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని స్పష్టం చేశారు. ఇరు పార్టీల సవాళ్ల నేపథ్యంలో గన్ పార్కు, సోమాజిగూడ ప్రెస్ క్లబ్, తెలంగాణ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోం

- అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తాం
- ఆధారాలతో ప్రజాప్రతినిధులు చర్చకు రావాలి
- పిరికివాళ్లం కాదు.. ఎవరితోపడితే వారితో చర్చించం
- కేసీఆర్ లాగా టెండర్లు ఇవ్వలేదు
- గురుకుల టెండర్లపై పొన్నం ఫైర్



**హైదరాబాద్, జూలై 2 :** గురుకుల టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో కన్నెర్రజేసింది. ప్రతిపక్ష నేతల సవాల్‌ను స్వీకరించి చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రులు.. దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని ప్రతిసవాల్ విసిరారు. నిరూపిస్తే గన్ పార్క్ వద్ద ముక్కు నేలకు రాసి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమంటూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురుకుల టెండర్ల వ్యవహారంలో బీఆర్ఎస్ విసిరిన సవాల్‌తో మంత్రులు గురువారం గన్ పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. చర్చకు తాము పూర్తిస్థాయిలో సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్ రావు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. అవసరమైతే ప్రెస్ క్లబ్‌కు కూడా వస్తామని, కానీ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన వ్యక్తులు మాత్రమే చర్చకు రావాలని ఆయన షరతు విధించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు 12 గంటల్లోగా గన్ పార్క్ దగ్గరకు రావాలని మంత్రి డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడికైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని ఆయన తేల్చిచెప్పారు. తాము అత్యంత పారదర్శకంగా టెండర్లు జరిగేలా చూశామని పేర్కొన్నారు. గురుకుల టెండర్ల కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు తమకేమైనా చుట్టాలా అని ప్రశ్నించారు. టెండర్లలో అసలు 2 వేల కోట్లు అవినీతి జరిగిందా, లేక 5 వేల కోట్లు జరిగిందా అన్నది బీఆర్ఎస్ నేతలు నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలతో వస్తే తాము చర్చకు సిద్ధమని, అవినీతి జరిగినట్లు నిరూపిస్తే 3 మంత్రులం గన్ పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తామని పొన్నం సవాల్ విసిరారు. తాము పిరికివాళ్లం కాదని, అలాగని ఎవరితో పడితే వారితో చర్చకు రాబోమని తేల్చిచెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ తన గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలని, లేదంటే కేసీఆర్‌కే చెడ్డపేరు వస్తుందని సూచించారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. ఆయన అవినీతి చేసి ఉండొచ్చని, ఆర్ఎస్‌కు తాము సమాధానం చెప్పబోమని స్పష్టం చేశారు. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం తీవ్రంగా హెచ్చరించారు.

# చేతగానోళ్లు ఎందుకు సవాళ్లు చేయాలి

- బీఆర్ఎస్‌తో చర్చకు కాంగ్రెస్ కు భయం
- పారిపోయిన సీఎం, మంత్రులు!
- తోక ముడిచిన మంత్రి జూపల్లి
- అరెస్టులు చేయించడం దుర్మార్గం
- గన్ పార్క్ వద్ద తొడలు కొడతారా.. దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి!
- కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్, జూలై 2 :** బీఆర్ఎస్‌తో చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి, మంత్రులు తీరా సమయానికి తోక ముడిచి పారిపోయారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, 30 నెలల పాలనలో ప్రభుత్వం చేసిన దగా, వైఫల్యాలపై అక్కడే తేల్చుకుందామని ఆయన సవాల్ విసిరారు. ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌కు వచ్చి మంత్రుల కోసం ఎదురుచూశామని కేటీఆర్ తెలిపారు. అసలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాల్ చేస్తే.. మధ్యలో సందట్లో సడేమియాలా మంత్రి జూపల్లి కృష్ణారావు దూరాడని విమర్శించారు. తీరా ఆయన కోసం భవన్‌లో కుర్చీ వేసి, శాలువాతో సిద్ధంగా ఉన్నా.. చర్చకు రాకుండా పారిపోయి గన్ పార్క్ కు వెళ్లాడని ఎద్దేవా చేశారు. పోనీ తామే అక్కడికి వద్దామంటే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి రాలేదని గన్ పార్క్ కు బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్ రావును, ఇతర నేతలను గేటు దాటక ముందే దుర్మార్గంగా అరెస్టు చేశారని కేటీఆర్ మండిపడ్డారు. కంచన్‌బాగ్‌కు వెళ్లి అరెస్ట్ అయిన నేతలను పరామర్శిద్దామని అనుకుంటే.. తనను కూడా గేటు నుంచి అడుగు బయట పెట్టకుండా పోలీసులు భారీగా మోహరించి అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మంత్రులు అక్కడ కూర్చుని తొడలు కొడితే ప్రయోజనం ఏముందని, ఇక్కడ పోలీసులతో తమను అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మంత్రులు చర్చకు వస్తే రాష్ట్ర ప్రజల ముందు వాస్తవాలన్నీ ఉంచుదామని అనుకున్నామని, కానీ సవాళ్లు స్వీకరించే సత్తా ఈ ముఖ్యమంత్రికి, మంత్రులకు లేదని కేటీఆర్ విమర్శించారు. అవినీతి, అప్పుల మీద బీఆర్ఎస్‌తో చర్చ అంటే ఇంత భయం ఎందుకని ఆయన ప్రశ్నించారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాళ్లు చేయాలని నిలదీశారు. ప్రభుత్వానికి నిజంగా దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సెషన్ పెట్టాలని డిమాండ్ చేశారు. 30 నెలల పాలనలో చేసిన దగా, మోసం, వైఫల్యాలతో పాటు అన్ని అంశాలపై అక్కడే చర్చిద్దామని సవాల్ చేశారు. హరీశ్ రావుతో పాటు అరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మూసీ తొలి దశకు గ్రీన్ సిగ్నల్

- పనుల కోసం 7345 కోట్ల కేటాయింపు
- కొత్త చట్టాలపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం
- టీచర్లకూ ఇక మధ్యాహ్న భోజన సదుపాయం
- ఆసుపత్రుల్లో 6278 వైద్య పోస్టుల మంజూరు
- కేబినెట్ కీలక నిర్ణయాలు!

**హైదరాబాద్, జులై 2 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తొలి దశ పనులతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పోస్టుల మంజూరు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం లాంటి విశేష అంశాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ తొలి దశ పనులకు మంత్రివర్గం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి పనుల కోసం 7345 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనుల నిర్వహణ కోసం కొత్తగా 147 పోస్టుల సృష్టికి, ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపింది.



### కొత్త చట్టాలపై న్యాయపోరాటం..

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై (బీఎన్ఎస్) రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఈ చట్టాల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ నివేదించింది. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ చట్టాన్ని జులై 1 నుంచి అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినా.. నిబంధనలపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

### ఉపాధ్యాయులకూ మధ్యాహ్న భోజనం..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విద్యార్థులతో కలిసి ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడంతో పాటు భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని అధికారులు భావిస్తున్నారు.

### టిమ్స్ ఆసుపత్రుల్లో పోస్టుల మంజూరు..

కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 6278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### విద్యాలయాలు, గోదాములకు భూములు..

రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్ నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే జగిత్యాల జిల్లా చల్గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాలు కేటాయించారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణం కోసం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంటలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# కవిత అరెస్టు!

- ఉప్పల్‌లో ఉద్రిక్తంగా మారిన భూపోరాటం
- బోడుప్పల్‌లో టీఆర్ఎస్ అధ్యక్షురాలిని అడ్డుకున్న పోలీసులు
- ఉద్యమకారులపై పోలీసుల విచక్షణారహిత లాఠీచార్జి
- రక్తం చిందిందంటూ కవిత తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, జులై 2 :** ఉప్పల్ నియోజకవర్గం బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాల స్థలం హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం ఉప్పల్ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా అక్కడికి చేరుకున్న కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటుచేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ కవిత మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారని మండిపడ్డారు. ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏమీ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్ డౌన్ షురూ అయిందని ఆమె హెచ్చరించారు. ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే డిమాండ్ చేశామని తెలిపారు. ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీచార్జి చేసి రక్తం చిందించడం అన్యాయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రతి రోజూ హామీలను గుర్తుచేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భూపోరాటానికి కవిత పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే, భూపోరాటానికి వెళ్తున్నారనే సమాచారంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేశారు. పోలీసుల తీరుపై ఆ పార్టీ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు.



# కిరీటం దొంగల అరెస్టు!

**బాసర ఆలయ చోరీ కేసు.. అంతర్ రాష్ట్ర దొంగల పట్టివేత**

**నాందేడ్ వెళుతుండగా నిందితుల అరెస్టు.. కిరీటం, పట్టీ స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి**




**నిర్మల్, జులై 2 :** ఎంతో పవిత్రమైన బాసర అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి అమ్మవారి వెండి కిరీటం, వెండి పట్టీ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం ఆమె మీడియాతో పంచుకున్నారు. బాసర ఆలయంలో పెద్ద వెండి కిరీటం దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు రాగానే విచారణ చేపట్టామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఇది అంతర్ రాష్ట్ర దొంగల పనిగా గుర్తించినట్లు వెల్లడించారు. ఈ చోరీకి పాల్పడింది పల్లపు ఏడుకొండలు, గైని రామకృష్ణ, కొడమ ఆనంద్ అని ఆమె స్పష్టం చేశారు. రైల్వే సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోని ఆలయాల్లో చోరీ చేయడం వీళ్ల ప్రత్యేకత అని వివరించారు. బాసర ఆలయంలో చోరీ జరిగిన వెంటనే దొంగల గాలింపు కోసం 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అత్యంత వేగంగా కేసును ఛేదించామని ఎస్పీ వివరించారు. దొంగిలించిన వస్తువులను అమ్మడం కోసం రైలులో నాందేడ్ వెళుతుండగా నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 1 కిలో 220 గ్రాముల వెండి కిరీటం, 260 గ్రాముల వెండి పట్టీ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చాలా తక్కువ సమయంలోనే ఎంతో చాకచక్యంగా దొంగలను పట్టుకుని, వస్తువులను రికవరీ చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా వారికి ప్రోత్సాహకాలు అందజేశారు.

# మంత్రి సురేఖ గైర్హాజరు!

**మంత్రివర్గ భేటీకి సురేఖ దూరం.. ట్రస్ట్ బోర్డుపై తీవ్ర అసంతృప్తి**

**విదేశీ పర్యటన నుంచి వచ్చినా.. తన అభిప్రాయం తీసుకోలేదని ఆవేదన**

**హైదరాబాద్, జులై 2 :** రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వ్యవహారమే ఆమె అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి మంత్రి కొండా సురేఖ హాజరుకాలేదు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ.. ఆమె కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని అంతా భావిస్తున్నారు. సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ దీనిపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

### ట్రస్ట్ బోర్డు వ్యవహారమే..

ప్రధానంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి సురేఖ అసంతృప్తికి కారణమని తెలుస్తోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటులో.. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో తీవ్ర అలిగిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే మంత్రివర్గ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది.

# జర్నలిస్ట్ కేవీఆర్‌కు 14 రోజుల రిమాండ్

**విజయనగరం, జులై 2 :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన తెలంగాణ జర్నలిస్ట్ కే వెంకటరామిరెడ్డికి (కేవీఆర్) కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఆయనను బడంగి పోలీసులు విజయనగరం జిల్లా బొబ్బిలి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈ తీర్పు వెలువరించారు. సీఎం, డిప్యూటీ సీఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో జర్నలిస్ట్ కేవీఆర్‌ను బడంగి పోలీసులు విజయనగరం జిల్లా బొబ్బిలి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు ఈ నెల 14 వరకు రిమాండ్ విధించారు. దీంతో కేవీఆర్‌ను బొబ్బిలి జైలుకు తరలించారు. విజయనగరం జిల్లా బడంగి మాజీ సర్పంచ్ కండి రమేష్ ఫిర్యాదు మేరకు కేవీఆర్‌ను హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో బడంగి పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. భారత రాజ్యాంగంతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లపై కేవీఆర్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారని రమేష్ ఏప్రిల్ 10 న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేవీఆర్‌ను బొబ్బిలి పోలీస్ స్టేషన్‌కు బుధవారం తీసుకొచ్చారు.

# కళ్లుచెదిరే అక్రమాస్తులు

**ఏసీబీ వలలో డీఎస్పీ భీమ్‌రెడ్డి.. 200 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు**

**16 చోట్ల ఏకకాలంలో సోదాలు..భారీగా నగదు, బంగారం సీజ్**



**హైదరాబాద్, జులై 2 :** ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించిన కేసులో డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) విభాగంలో పనిచేస్తున్న ఆయన అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గురువారం ఏకకాలంలో 16 చోట్ల సోదాలు నిర్వహించి కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. నార్సింగిలోని భీమ్‌రెడ్డి ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దాడుల్లో భారీ ఎత్తున విల్లాలు, ఇళ్లు, ప్లాట్లు, కమర్షియల్ స్పేస్‌లు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ ఆయనకు వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. ఆయన ఇంట్లో స్థిరాస్తుల పత్రాలతో పాటు 43.06 లక్షల నగదు, దాదాపు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, 23 విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు సీజ్ చేశారు. సోదాల సమయంలో దొరికిన మద్యం బాటిళ్లపై ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించారు. ఇబ్రహీంబాగ్‌లోని వెస్సెల్లా మెడోస్‌లో విల్లా, టెలికాంనగర్‌లో జీ ప్లస్ 2 ఇంటితో పాటు ఒక ప్లాట్, గచ్చిబౌలిలో ఒక ప్లాట్, మణికొండలో 500 గజాల 5 కమర్షియల్ కాంప్లెక్స్‌లో వాటా, 3000 చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్‌లను ఏసీబీ అధికారులు గుర్తించారు. తెల్లాపూర్‌లో 2 ప్లాట్లు, ప్రగతి రిసార్ట్స్ సమీపంలో 500 గజాల ప్లాట్, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 3.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. కర్ణాటకలో వేర్వేరు చోట్ల దాదాపు 45 ఎకరాల భూములు ఉన్నట్లు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నాగోల్ కామినేని ఆసుపత్రి సమీపంలో 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు జీపీఆర్ హౌసింగ్ సొసైటీ సమీపంలో 400 గజాల ప్లాట్, పటాన్‌చెరులో మరో 200 గజాల ప్లాట్ ఉన్నట్లు గుర్తించారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో 1000 గజాల స్థలం, 2 ఎకరాల వ్యవసాయ భూమి, శ్రీ రాఘవేంద్ర రాక్స్ అండ్ మినరల్స్‌లో 75 లక్షల పెట్టుబడి, వికారాబాద్ జిల్లాలో 4.20 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. డీఎస్పీ బ్యాంకు ఖాతాల్లో 19.91 లక్షల నిల్వలు ఉన్నట్లు తేల్చారు. భీమ్‌రెడ్డి తన చట్టబద్ధమైన ఆదాయ వనరులకు మించి అవినీతి, అక్రమ మార్గాల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టారని ఏసీబీ స్పష్టం చేసింది. ఈ ఆస్తుల అసలు మార్కెట్ విలువ డాక్యుమెంట్లలో చూపిన దానికంటే చాలా రెట్లు (దాదాపు 200 కోట్లకు పైగా) ఎక్కువే ఉంటుందని అధికారులు వెల్లడించారు. భీమ్‌రెడ్డిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# స్మగ్లర్ల కొత్త రూట్!

**స్పీడ్ పోస్టులో గంజాయి డెలివరీ.. పార్శిల్స్‌లో మందుల పేరిట రవాణా**

**ముఠాను అరెస్టు చేసిన పోలీసులు..వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్**



**హైదరాబాద్, జులై 2 :** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్టు, కొరియర్ పార్శిల్స్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న కిలాడీ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. 21 రాష్ట్రాలకు వాట్సాప్ కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ ఆర్డర్లు తీసుకుని డోర్ డెలివరీ చేస్తున్న ఈ ముఠా వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ గురువారం మీడియాతో పంచుకున్నారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమానాస్పద పార్శిల్స్‌పై దర్యాప్తు చేయగా ఈ గంజాయి ముఠా గుట్టు రట్టయిందని సీపీ సజ్జనార్ తెలిపారు. అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రా అనే ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చే స్పీడ్ పోస్టు పార్శిల్స్‌కు స్కానింగ్ లేకపోవడంతో వీరికి సరఫరా సులభంగా మారిందని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర శాఖలకు లేఖ రాస్తామని, నగరంలోని కొరియర్ సంస్థలన్నీ పార్శిల్స్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశించారు.

### మందుల పేరిట మోసం..

నిందితుడు సత్యం మిశ్రా 2018 నుంచి గంజాయికి అలవాటు పడి రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌లతో కలిసి ఒక సిండికేట్‌గా ఏర్పడ్డాడు. సొంత ఊరిలో రైతుల ద్వారా గంజాయి పండించి కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పార్శిల్స్‌లో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని సీపీ తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు లాంటి పలు ప్రధాన నగరాలకు స్పీడ్ పోస్టు ద్వారా గంజాయి పంపుతున్నారని వివరించారు. అనుమానాస్పద పార్శిల్స్ వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### ఏటా కోట్లలో టర్నోవర్..

సరఫరాదారులు, కస్టమర్ల మధ్య వాట్సాప్‌లో కోడ్స్ ద్వారా ఆర్డర్లు జరుగుతాయని, యూపీఐ ద్వారా నగదు లావాదేవీలు చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. రోజుకు 80 నుంచి 100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్టు ద్వారా డెలివరీ చేస్తున్నారు. ఒక్కో పార్శిల్‌లో 50 నుంచి 250 గ్రాముల గంజాయి ఉంచుతూ విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను 1500 నుంచి 8000 వరకు అమ్ముతూ.. రోజుకు 1 లక్షకు పైగా ఆదాయం గడిస్తున్నారు. ఇలా నెలకు 30 నుంచి 35 లక్షలు, ఏడాదికి 4 నుంచి 5 కోట్ల వరకు టర్నోవర్ చేస్తున్నట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొన్నారని, పలు బ్యాంకు ఖాతాల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లతో మనీలాండరింగ్ చేశారని స్పష్టం చేశారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
3 జూలై 2026



# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు!

## రెండేళ్ల ముందే ఎన్నికల వేడి..

**రేవంత్, కేటీఆర్ సవాల్-ప్రతిసవాళ్లతో పీక్‌కు చేరిన పొలిటికల్ హీట్!**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్ల ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఓక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపతేం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడుతోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

# యూజర్‌నేమ్ ఫీచర్‌పై వాట్సాప్ క్లారిటీ

- ఇంకా అమల్లోకి రాలేదు.. దశలవారీగా అందుబాటులోకి
- యూజర్‌నేమ్ ఉన్నా మొబైల్ నంబర్ తప్పనిసరే
- కేంద్రం ఆందోళనలకు మెటా సంస్థ వివరణ




**న్యూఢిల్లీ, జూలై 2:** వాట్సాప్‌లో ప్రవేశపెట్టనున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాలేదని, కేవలం యూజర్‌నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి దశలవారీగా ఈ ఫీచర్‌ను అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్ ద్వారా కొత్త వ్యక్తులు లేదా గ్రూపులతో మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా సంభాషించే అవకాశం ఉంటుందని వాట్సాప్ తెలిపింది. అయితే ఈ ఫీచర్‌ను ఉపయోగించడం పూర్తిగా వినియోగదారుల ఇష్టమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ సృష్టించాల్సిన అవసరం లేదని పేర్కొంది. వాట్సాప్ సేవలను ఉపయోగించేందుకు మొబైల్ నంబర్ మాత్రం ఎప్పటికీ తప్పనిసరిగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లను ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేస్తామని, ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, ధ్రువీకరించబడిన ఖాతాలకు సంబంధించిన పేర్లు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక రక్షణ కల్పిస్తామని తెలిపింది. ఒకవేళ కోరుకున్న పేరు ఇప్పటికే వినియోగంలో ఉంటే ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించింది. యూజర్‌నేమ్‌లను నేరుగా వెతికే అవకాశం ఉండదని వాట్సాప్ స్పష్టం చేసింది. కొత్త వ్యక్తి నుంచి సందేశం వచ్చినప్పుడు అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు వంటి సమాచారం చూపించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే అమల్లో ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా సదుపాయాలు కొనసాగుతాయని పేర్కొంది. అదనపు భద్రత కోసం యూజర్‌నేమ్ కీ అనే కొత్త వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. దీనిని వినియోగదారులు అవసరమైతే ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. యూజర్‌నేమ్ ఫీచర్ కారణంగా నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లను పోలిన యూజర్‌నేమ్‌ల దుర్వినియోగాన్ని అరికట్టే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయవద్దని వాట్సాప్‌కు సూచించింది. అలాగే భద్రతా చర్యలపై మూడు రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనికి స్పందించిన వాట్సాప్, ప్రస్తుతం యూజర్‌నేమ్ ఆధారిత మెసేజింగ్ సేవ ప్రారంభం కాలేదని, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని రక్షణ చర్యలతోనే ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేసింది.




# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం**

**శ్రీనగర్, జూలై 2:** హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గూన్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు.

# అయోధ్య విరాళాల వివాదంలో మరో మలుపు!



- చంపత్ రాయ్‌పై పోలీసులకు ఫిర్యాదు
- అనిల్ మిశ్రా సహా నలుగురిపై కేసు నమోదు చేయాలని న్యాయవాదుల డిమాండ్
- జులై 6న ట్రస్ట్ అత్యవసర సమావేశం..
- కీలక నిర్ణయాలపై ఉత్కంఠ

**అయోధ్య, జులై 2 :** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో విరాళాల దుర్వినియోగం వ్యవహారం మరింత ముదురుతోంది. ఇప్పటికే ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఫైజాబాద్ తరఫున న్యాయవాదులు చంపత్ రాయ్‌తో పాటు అనిల్ మిశ్రా, కృష్ణ దేవ్, గోపాల్ రావ్‌లపై అయోధ్యలోని రామజన్మభూమి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా మాట్లాడుతూ, నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామని తెలిపారు. ఫిర్యాదు స్వీకరణకు సంబంధించిన కాపీ ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అయితే రామమందిరం విరాళాల వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగాయంటూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అనంతరం పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, విరాళాల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎనిమిది మంది ఉద్యోగులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా చంపత్ రాయ్ వాంగ్మూలాన్ని కూడా సిట్ అధికారులు నమోదు చేశారు. ఇక జులై 6న అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అత్యవసర సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో రెండు మూడొంతుల మెజారిటీతో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల భవితవ్యంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సిట్ నివేదిక ఆధారంగా ట్రస్ట్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముందని సమాచారం.

# జపాన్ ప్రధాని నా అందమైన చెల్లెలు

- మోదీ ఆప్యాయతకు తకాయిచీ ఫిదా
- భారత్-జపాన్ బంధానికి కొత్త ఊపు
- రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- ఫార్మా, రక్షణ, కృత్రిమ మేధస్సు రంగాల్లో కీలక ఒప్పందాలు



**న్యూఢిల్లీ, జులై 3 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయె తకాయిచీకి ఆత్మీయ స్వాగతం పలికారు. ఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో తకాయిచీని ఉద్దేశించి "నా అందమైన చెల్లెలు" అని సంబోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోదీ చూపిన ఆప్యాయతకు చిరునవ్వుతో స్పందించిన తకాయిచీ, తనను "అందమైన చెల్లెలు"గా సంబోధించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్--జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాలు వ్యాపారం, రక్షణ, ఔషధ తయారీ, కృత్రిమ మేధస్సు, పెట్టుబడులు తదితర కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వచ్చే పదేళ్లలో సుమారు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్‌ను తొలిసారిగా అధికారికంగా సందర్శిస్తున్న జపాన్ తొలి మహిళా ప్రధాని సనాయె తకాయిచీకి స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆమె దూరదృష్టి కలిగిన నాయకురాలని ప్రశంసించారు. ఇరు దేశాల ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం కీలకమని పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం భారత్‌కు చేరుకున్న తకాయిచీ, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై ఇరు దేశాల నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్ చేరుకున్న అనంతరం తకాయిచీ తన పర్యటనకు సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమంలో పంచుకోగా, ప్రధాని మోదీ స్పందిస్తూ ఆమెకు హృదయపూర్వక స్వాగతం పలికారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ సమావేశం కొత్త దిశను చూపుతుందని, ఉమ్మడి కృషితో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సమృద్ధిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# పేదలు చావాలా...?

- విధులకు రాకుండానే సంతకాలు చేస్తారా..?
- ప్రభుత్వ ఆసుపత్రి ముందు సీపీఐ భారీ ధర్నా

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న వైద్యుల తీవ్ర నిర్లక్ష్యంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిప్పులు చెరిగింది. ఆసుపత్రిని నిర్లక్ష్యానికి నిలయంగా మార్చిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రధాన ఆసుపత్రి ముందు గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, కొందరు వైద్యుల లీలలు బయటపడటం ప్రభుత్వ వైద్య వ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన నిర్ల క్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. వైద్యులు విధులకు హాజరు కాకుండానే ముందుగానే సంతకాలు చేయడం, మరికొందరు హాజరు నమోదు చేసిన తర్వాత ఆసుపత్రి నుంచి మాయమవ్వడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. పేదలు, గిరిజనులు, కూలీలు, సామాన్య ప్రజలకు చివరి ఆశ్రయమైన ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి బాధ్యతారాహిత్యం వల్ల రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల విధులను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఆసుపత్రి సూపరింటెండెంట్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారని చిరంజీవి విమర్శించారు. పర్యవేక్షణ లోపాలు ఉండటం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని, దీనివల్ల ప్రజలు ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.విధులకు హాజరు కాకుండానే హాజరు నమోదు చేసిన వైద్యులపై, విధులను మధ్యలో వదిలి



వెళ్లిన వారిపై వెంటనే శాఖాపరమైన, కఠిన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆసుపత్రిలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, నిరంతర ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో రాజీ పడే ఎలాంటి నిర్ల క్ష్యాన్నైనా సీపీఐ సహించదని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరే ప్రకాష్, పిడుగు శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, పిప్పిరి వెంకటేష్, శ్రీరామ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డెన్ అలీకి ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :**
జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన సంక్షేమ అధికారి అలీని గురువారం పి.ఎం.ఆర్.సి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఏటీడీఓ చిరంజీవి, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, టీఎస్టీ డ బ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, కోశాధికారి కూడ్మేత అనంత్ ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జీసీడీఓ శకుంతల మాట్లాడుతూ.. అలీ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ, విద్యార్థుల సంక్షేమం, వసతి గృహ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరిత, పీఎంఆర్సీ సిబ్బంది చంద్రమోహన్, ధనలక్ష్మి , చిరంజీవి, మహేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

రోడ్డు దాటుతుండగా ప్రమాదం





**ఉద్యమ కెరటం, తాండూర్:**
మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట భూదేవి (70) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు తాండూర్ ఏఎస్సై రాజ మొగిలి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూదేవి తన కుమారుడు శంకర్ ఇంటికి వెళ్లి తిరిగి స్వగృహానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై డివైడర్ దాటుతున్న సమయంలో చంద్రాపూర్ నుంచి బెల్ల oపల్లివైపు వెళ్తున్న ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు, నడుము భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థా నికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టు మార్టు నిమిత్తం బెల్ల oపల్లిప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు కోట శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నట్లు వివరించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి

కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్

బోథ్లో ఘనంగా రైతు భరోసా సంబరాలు



**ఉద్యమ కెరటం, బోథ్:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా నిధులను విడుదల చేయడాన్ని పురస్కరించుకుని గురువారం బోథ్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై పత్తి, కందులు, సోయాబీన్ విత్తనాలు అందించడంతో పాటు స్ప్రింక్ల ర్లు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, స్ప్రేయర్లు, ఉద్యానవన పథకాల ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు పండించే ప్రతి గింజను గిట్టు బాటు ధరకు కొనుగోలు చేయడంతో పాటు రైతు రుణమాఫీ అమలు చేయడం వంటి నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వం నిజమైన రైతు పక్షపాతిగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ దాస్, మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ రాజు రెడ్డి, మాజీ డైరెక్టర్ అబ్రార్, ఆత్మ డైరెక్ట ర్లుఅబుద్, రహీమొద్దీన్, కుచ్లాపూర్ ఉప సర్పంచ్ అరుణ్ రెడ్డి, సీనియర్ నాయకులు మొహమ్మద్, హసీబ్, అనుపట్ల సంజీవ్, అచ్యుతానంద రెడ్డి, బీరం రవి, గడ్డల నారాయణ, భీమా భూచన్న, ఎండీ సద్దాం, జగన్, షేక్ షాకీర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలలో ఆదర్శ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

బ్రాంజ్ మెడల్ కైవసం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు శివరాత్రి సంజన, సిరికొండ సాయి శివ మల్లికలు జాతీయ స్థాయిలో రాణించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టా రు.గతనెల జూన్ 24 నుండి 25 వరకు మహబూబ్ నగర్ జిల్లా లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో వీరిద్దరూ అద్భుత ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ తర్వాత కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలలో దేశవ్యాప్తంగా ఉన్న పలు జట్లతో తలపడి, అత్యుత్తమ ఆటతీరుతో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో మెడల్ సాధించి విజేతలుగా నిలిచిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్, ఉపాధ్యాయులు ఎం. మల్లేష్, ఎస్. శ్రీ వర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి. తిరుపతి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ జాతీయ స్థాయికి ఎదిగి పతకాలు సాధించడం గర్వకారణమని, రాబోయే రోజుల్లో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## పేద విద్యార్థుల చదువులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ రూపనార్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నత చదువులపై నిర్లక్ష్య వైఖరిని వీడాలని బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రమేష్ రూపనార్ డిమాండ్ చేశారు. జాతీయ, రాష్ట్ర బీసీ జేఏసీల పిలుపు మేరకు జిల్లాలో గురువారం నిర్వహించిన కాలేజీల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పాత పద్ధతిలోనే రీయింబర్స్మెంట్ విధానాన్ని కొనసాగిస్తూ, పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల వల్ల ఫీజులు చెల్లించలేక రాష్ట్రంలో ఇప్పటికే తొమ్మిది మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కాంట్రాక్ట ర్ల కు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లి స్తున్న పాలకులు, లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు ముడిపడి ఉన్న 7 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ఈ నెల 15వ తేదీలోగా బకాయిలు విడుదల చేయకుంటే రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు లోబడే లహు




కుమార్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి కిరణ్, డివిజన్ అధ్యక్షుడు బొట్టు పల్లిప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడి

- ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం ఆదిలాబాద్ :** మావల మండలకేంద్రంలోని రైతు వేదికలో 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ – కాపస్ క్రాంతి' కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆత్మ చైర్మన్ సంతోష్, జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సిం గ్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రత పద్ధతిని అనుసరించడం ద్వారా తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉందని వివరించారు. ఈ ఆధునిక సాగు పద్ధతులను పాటించడం వల్ల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని, అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మంచి పంట దిగుబడిని అందుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారి, మావల, వాఘపూర్ సర్పంచులు ధర్మపురి చంద్రశేఖర్, దినేష్ లు,ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దౌలత్ రావు

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగ బద్ధమైన హక్కు అని గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు అన్నారు. మండలంలోని మన్నూర్, శంభుగూడ, మామిడిగూడ గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు, కొత్త ఓటరు నమోదు కోసం స్థానిక బీఎల్ఓలను సంప్రదించి నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా అధికారులు పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే తమను సంప్ర



దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు, బీఎల్ఓలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువును మధ్యలో ఆపవద్దు ...





- **ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం**
- **ఐటీడీఏ ఉట్నూర్ పీ ఓ మంద మకరందు**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు గురువారం ఆసిఫాబాద్ లోని టిడబ్ల్యు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక (మోటివేషన్) తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ ప్రణాళిక, లక్ష్య సాధన, పోటీ పరీక్షలు భవిష్యత్తులో అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పూర్తయిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ చదువును మధ్యలో నిలిపివేయవద్దని సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలు తదితర రంగాల్లో ఎన్నో అవకాశాలు అందుబా టులో ఉన్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తూ విద్య ద్వారానే తన భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోకాబ్యులరీ ఆధారిత పదాల ఆటలను నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని ఆంగ్ల పద సంపదను పెంపొందించుకోవడంతో పాటు నేర్చుకునే ప్రక్రియను ఆనందదాయకంగా మార్చుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారి ఆసిఫాబా ద్‌లోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)ను సందర్శించి శిక్షణా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి, ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి, స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. కేంద్రంలో అందిస్తున్న శిక్షణ నాణ్యత, హాజరు, సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, యువజన శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజానికి దిక్సూచిలాంటి పుస్తకాలు రావాలి

- **తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** సమాజంలో ఆలోచనలను రేకెత్తించే, సరికొత్త దృక్పథాలను ఆవిష్కరించే దిక్సూచిలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో 'నేటి నిజం' పత్రిక ప్రచురించిన "ఆలోచన ఆవిష్కరణ" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పత్రికా రంగంతో పాటు సాహిత్య, సామాజిక రంగాలకు 'నేటి నిజం' అందిస్తున్న సేవలను కొనియాడారు. సమాజ హితం కోరే ఇటువంటి ప్రచురణలు పాఠకులకు ఎంతో జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. 'నేటి నిజం' యాజమాన్యం సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాన్ని ప్రచురించి, పాఠకులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, నేటి నిజం మేనేజింగ్ డైరెక్టర్ బైసా వీణాదాస్, నేటి నిజం ఎడిటర్ బైసా దేవదాస్, టుడే ఫ్రీడమ్ ఎడిటర్ ఆజం ఖాన్ పాల్గొన్నారు.

# నాలుగో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత బొగ్గు గనుల అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం సత్తుపల్లి సింగరేణి ప్రాంతంలో నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో పాల్గొన్న అధికారులకు తోటి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధికి రాత్రింబవళ్లు కృషి చేస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం నిర్ల క్ష్యవైఖరిని వీడి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అధికారుల ప్రధాన డిమాండ్లలో పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం (పీఆర్పీ) బకాయిలను వెంటనే విడుదల చేయడం, పెండింగ్లో ఉన్న వేతనాల ఉన్నతీకరణను అమలు చేయడం ప్రధానమైనవని తెలిపారు. ఈ



అంశాలపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమస్యలు పరిష్కారం కాకపోతే సంస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధిలో అధికారుల సేవలు కీలకమైనవని, వారి సమస్యలను పరిష్కరించడం యాజమాన్యం బాధ్యత అని స్పష్టం చేశారు. ఈనెల 13 వరకు రిలే నిరాహార దీక్షలు నిరంతరాయంగా కొనసాగుతాయని, అప్పటికీ యాజమాన్యం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సింగరేణి సంస్థలో సానుకూల వాతావరణం నెలకొల్పాలని ప్రభుత్వం, యాజమాన్యాన్ని కోరారు.

# అభ్యాసన సామర్థ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో ఫిజిక్స్ లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కేవలం సిలబస్ పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్ను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డీఐఈఓల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్లైన్ ప్లా ట్ఫారమ్ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీ స్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు. ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా నెలవారీ సమీక్షలు, ఈ విద్యా సంవత్సరంలో 3 నుంచి 4 కాంప్లె క్స్



సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్, జిల్లా అకాడమిక్ కమిటీ సభ్యులు సూరజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమాకాంత్, తిరుపతి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేట రోటరీ క్లబ్ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు.

**ఉద్యమ కెరటం,సదాశివపేట**

సదాశివపేట రోటరీ క్లబ్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ప్రత్యేకమైన కార్యక్రమాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని అవార్డ్స్ సాధించిందని క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి మంచి సేవ కార్యక్రమాలను చేసిన రోటరీ క్లబ్ కి ఇచ్చే అవార్డ్స్ కార్యక్రమం శోభితం 2025-26 హైదరాబాద్ లో జరిగింది. ఇందులో సదాశివపేట రోటరీ క్లబ్ ఒక బంగారు పథకము నాలుగు వెండి పథకాలతో పాటు కాకతీయ రీజన్ లో నూతనంగా ఏర్పడ్డ క్లబ్బుల ప్రదర్శన ఆధారంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇంత తక్కువ పీరియడ్ రాష్ట్రస్థాయిలో ఈ విధంగా గుర్తింపు రావడం తమకు గర్వంగా ఉందని సదాశివపేట క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. క్లబ్ ఎలక్టెడ్ కార్యదర్శి మఠం రాచన్న మాట్లాడుతూ ఈ. సంవత్సర కాలంలోచేసిన పనుల గురించి తెలుపుతూ మొదటగా మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించామని, అందులో 200 కి పైన స్క్రీనింగ్ జరిగాయని, దానికోసం హైద్రాబాద్ నుండి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కుండిన క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం పిసుకువచ్చి అందరికీ స్క్రీనింగ్ చేశామని తెలిపారు. ఇదే కాకుండా హెల్త్ క్యాంప్, కాలేజీ విద్యార్థులు చెడు అలవాట్ల కు బానిసలు కాకుండా ఉండడానికి వారికి అవేర్ నెస్ కోసం నిపుణులతో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులు ఇంటర్ తరువాత ఏ దారిలో వెళ్ళాలి,ఏది చదివితే మంచి ఉపాధి అవకాశాలు వస్తాయనే విషయంలో పారిశ్రామిక వేత్తలతో వారికి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ఈ ఎన్ టి స్క్రీనింగ్ కార్యక్రమము 100కుగా విద్యార్థులకు చేయడం జరిగింది. మన ప్రాంతంలో అతి పెద్ద కర్మాగారం అయిన మహీంద్రా కంపెనీ లో ఉద్యోగాల కోసం జాబ్ మేళాని నిర్వహించి సదాశివపేట మండలం లోని కొందరికి ఉపాధి కల్పించడం జరిగిందని తెలిపారు.వీటితోపాటు సేవా దృక్పథంతో నడపబడుతున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలకి మొయినాబాద్ క్లబ్ వారి సహకారంతో నూతన అంతస్తు నిర్మించి ఇవ్వడం.

# అటవీ సంరక్షణలో డీఎఫ్ఓ ప్రశాంత్ ముద్ర

**మూడేళ్లలో విశేష విజయాలు.. నిజామాబాద్కు బదిలీ**

**జిల్లా లో మూడు పులుల సంచారం గుర్తింపు**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) ప్రశాంత్ బాజీరావు పాటిల్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన మూడేళ్ల పదవీ కాలంలో జిల్లాలో చేపట్టిన అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల గురించి 'ఉద్యమ కెరటం'తో ప్రత్యేకంగా మాట్లాడారు. తన హయాంలో అటవీ ప్రాంతాల్లోని 15 ఆదివాసీ గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. ఆక్రమణకు గురైన 1,250 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని అక్కడ విస్తృతంగా మొక్కలు నాటించినట్లు చెప్పారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న సుమారు 200 కిలో మీటర్ల ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన పొచ్చెర, కుంటాల జలపాతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఉట్నూర్ అర్బన్ పార్కు అభివృద్ధికి రూ.2 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.4 కోట్ల నిధులు సాధించి యాపల్గూడ, దుర్గానగర్ పార్కులను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. మావల ఎకో టూరిజం పార్కును కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అడవుల సంరక్షణలో భాగంగా అటవీ స్మగ్లింగ్ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అటవీ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రతి ఏడాది రూ.80లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అడవుల్లో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పరిధిలో మూడు పులుల సంచారాన్ని అధికారికంగా గుర్తించినట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, గిరిజనులు, అటవీ శాఖ సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. ఇదే అంకితభావంతో నిజామాబాద్ జిల్లాలోనూ అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బాధలో ఉన్న కుటుంబానికి సర్పంచ్ భరోసా

**మృతుడి కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సాయం**



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన ప్రజాప్రతినిధి బాధ్యత అని నిరూపించారు పవర్గూడా గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న ఇంటికి వెళ్లి ఓదార్చడంతో పాటు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. జైనూర్ మండలం పవర్గూడా గ్రామానికి చెందిన మేశ్రం కళాబాయి భర్త జ్ఞానేశ్వర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం తనవంతు సహాయంగా రూ.3వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అవసరమైన ప్రతి సందర్భంలో గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన చూపిన ఆప్యాయతను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానికులు కూడా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టసమయంలో పరస్పరం అండగా నిలవడం గ్రామ గొప్ప సాంప్రదాయమని వారు పేర్కొన్నారు.

# తులం బంగారం ఎప్పుడిస్తారు..?

**బీజేపీ యువ నాయకుడు దుర్గం ప్రశాంత్**



**ఉద్యమ కెరటం, వాంకిడి:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా బీజేపీ యువ నాయకుడు దుర్గం ప్రశాంత్ డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు రూ.1లక్షతో పాటు ఒక తులం బంగారం అందిస్తామని ప్రకటించి ప్రభుత్వం ఏర్పడి చాలాకాలం గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వం ప్రకటించిన హామీ అమలుపై ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ప్రకటించిన అదనపు ప్రయోజనాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇకపై జాప్యం చేయకుండా ఎన్నికల హామీలను అమలు చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** వాంకిడి సబ్స్టేషన్లో 33 కేవీ ఇంటర్లింక్ పనులు, స్థానిక ఫీడర్ల డైవర్షన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం.రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్కు సంబంధించిన పనులు, తాగునీటి నిల్వ వంటి అవసరాలను ఉదయం 10 గంటలలోపు పూర్తి చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అభివృద్ధి పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తోందని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# సత్తు పల్లి అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే రాగమయి దయానంద్
- రూ.2.50 కోట్లతో చెరువు పునరుద్ధరణ
- నూతన రేషన్ దుకాణం ప్రారంభం



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి:** సత్తుపల్లి పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదటగా సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వేశ్యకాంతుల చెరువు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. చెరువు కట్టకు స్టోన్ పిచ్చింగ్, ఇరువైపులా స్టీల్ రైలింగ్ ఏర్పాటు, జంగిల్ క్లియరింగ్, కట్టపై వాకింగ్ ట్రాక్ మరమ్మత్తులు, బతుకమ్మ ఘాట్ నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే చెరువు సుందరీకరణతో పాటు రైతులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం జేవీఆర్ పార్క్ సమీపంలోని డబుల్ బెడ్రూమ్ అపార్ట్మెంట్ వద్ద రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. తహశీల్దా ర్, మున్సిపల్ కమిషనర్తో కలిసి భూసేకరణ, స్థల సేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించి, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అపార్ట్మెంట్ నివాసితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి సత్తుపల్లి మున్సిపాలిటీ 7వ వార్డులోని రాజీవ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాప్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వయంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నరసింహ, తహశీల్దా ర్, మున్సిపల్ చైర్మన్ రిహనా బేగం కమల్ పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు తోట సుజాల రాణి, హకీమ్, నసీమా షరీఫ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ ఏఈ, ఇరిగేషన్ జేఈ, సీనియర్ నాయకులు బొంతు వేణు, విరివాడ భూషణం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, రైతులు, అపార్ట్మెంట్ నివాసితులు, రాజీవ్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాల అమలులో వివక్ష వద్దు

## రాష్ట్ర లేబర్ కమిషనర్కు భవన నిర్మాణ కార్మికుల వినతి




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపవద్దని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు, కల్లూరు మండలాలకు చెందిన కార్మికులు గురువారం హైదరాబాద్లోని టంగుటూరి అంజయ్య కార్మిక సంక్షేమ భవనంలో రాష్ట్ర అదనపు లేబర్ కమిషనర్లు గంగాధర్, వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్లోని ఆసుపత్రుల్లో ప్రసవం జరిగిన తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల భార్య, కుమార్తెలకు సంక్షేమ బోర్డు అందించే రూ.30వేల ప్రసూతి ఆర్థిక సాయం కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు ఆన్లైన్లో స్వీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వర్లో మార్పులు చేసి ఏ రాష్ట్రంలో ప్రసవం జరిగినా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా సిఎస్ సి హెల్త్ టెస్టుల లీజు విధానాన్ని రద్దు చేసి కార్మికులకు నేరుగా వైద్య పరీక్షల కోసం ఆర్థిక సాయం అందించాలని, కార్మికుల పిల్లలకు విద్యా స్కాలర్షిప్లు మంజూరు చేయాలని, సొంత ఇంటి నిర్మాణానికి సంక్షేమ బోర్డు ద్వారా రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ మంజూరు చేయాలని, కార్మిక సంఘాల ప్రతినిధులతో సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సహజ మరణానికి ప్రస్తుతం అందిస్తున్న రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని రూ.5లక్షలకు పెంచడంతో పాటు ప్రసూతి, వివాహ సమయంలో ఇచ్చే రూ.30వేల సాయాన్ని రూ.లక్షకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థల ప్రమేయం లేకుండా అన్ని సంక్షేమ పథకాలను నేరుగా ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ బాజీ, మండల మహిళా నాయకురాలు పర్సా సరోజిని, చిన్నమల్లేల గ్రామ నాయకుడు పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కల్లూరు మండల బాధ్యుడు ఇనపనూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం బూత్ స్థాయిలో ఓటరు జాబితా పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, పత్రాల ధ్రువీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి అవసరమైన వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలను స్వీకరించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ సూపర్వైజర్ అధికారి, తాండూర్ ఆర్ఐ బి.పద్మజ, కంప్యూటర్ ఆపరేటర్ దాసరి మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి. ఈసా, తాండూర్ యూత్ అధ్యక్షుడు పెట్టెం విష్ణుకళ్యాణ్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండి.జుబేర్, బీఎల్ఓలు విజయలక్ష్మి, సుజాత, బీఎల్ఏ అబ్దు ల్ రెహమాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపేటలో రోడ్డు రచ్చతో రోడ్డెక్కిన గ్రామస్తు లు

## గ్రామం మధ్యలో 100 ఫీట్ల రోడ్డు వద్దంటూ నిరసన
## పెద్దలకు ఒక న్యాయం...పేదలకు మరొకటా?
## పేదల ఇళ్లపై మాస్టర్ ప్లాన్ బుల్డోజర్?

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్**

మల్లంపేట గ్రామంలో మాస్టర్ ప్లాన్ రహదారి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. దుండిగల్ మున్సిపల్ సర్కిల్ మల్లంపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుండి బాచుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై గ్రామస్తులు భారీ ధర్నా నిర్వహించారు. ఫ్లెక్సీలు, ప్లేకార్డులు చేత పట్టుకుని నిరసన పాదయాత్ర చేపట్టిన స్థానికులు "మాకు న్యాయం కావాలి", "ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు తెరవాలి", "మాస్టర్ ప్లాన్ పేరుతో గ్రామాన్ని నాశనం చేయొద్దు " అంటూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.గ్రామస్తుల ఆవేదన ప్రకారం... పాత మాస్టర్ ప్లాన్లో గ్రామానికి మూడు ప్రధాన రహదారులు ఉండగా, ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న కొత్త రహదారి సవరణలతో గ్రామం తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే అపార్ట్ మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల వాహన రద్దీతో గ్రామ ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా 100 ఫీట్ల రహదారి ప్రతిపాదన గ్రామ ఉనికికే ప్రమాదమని ఆరోపించారు.

### పేదల ఇళ్లపై అభివృద్ధి బుల్డోజర్

ధర్నాలో పాల్గొన్న బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ సర్కిల్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ... "మల్లంపేటకు మోడీ బిల్డర్ రోడ్డు, 110 సర్వే నంబర్ రోడ్డు, ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు వంటి మూడు ప్రధాన రహదారులు ఇప్పటికే ఉన్నాయి. అయినప్పటికీ ఊరు మధ్యలోనే 100 ఫీట్ల రహదారి తీసుకురావడం అన్యాయం" అని మండిపడ్డారు."500 ఏళ్ల చరిత్ర ఉన్న గ్రామంలో చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుంది. 30 లేదా 40 ఫీట్లు విస్తరణ వరకు ప్రజలు అర్థం చేసుకుంటారు. కానీ ఏకంగా 100 ఫీట్ల రహదారి పేరుతో గ్రామాన్ని చీల్చేయడం సరైంది కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.పెద్దలకు ఒక న్యాయం...పేదలకు మరో న్యాయమా?ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేదల జీవితాలతో ఆడుకుంటోందని ఆరోపించిన గ్రామస్తులు... పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ మార్పులు చేస్తున్నారని విమర్శించారు. "పేదలకు ఒక న్యాయం... పెద్దలకు మరో న్యాయమా?" అనే ప్రశ్నలు ధర్నా ప్రాంగణంలో గట్టిగా వినిపించాయి.స్పందించకపోతే భారీ ఉద్యమంముఖ్యమంత్రి, సంబంధిత అధికారులు, హెచ్ఎండిఏ వెంటనే స్పందించి ప్రతిపాదిత 100 ఫీట్ల రహదారిని ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే 'ఆరోగ్య పాఠశాల' లక్ష్యం

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలోని విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసాన్ని సమగ్రంగా పెంపొందించడమే 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం బజార్హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన మూడో విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు ఆరోగ్య పాఠశాల అంశాలపై పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, వ్యక్తిత్వ వికాసం వంటి ఆరు ప్రధాన అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం విజయవంతంగా అమలవుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల రక్షణ కోసం పాక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు పాక్సో క్యాలెండర్ ను విడుదల చేశామని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతినెల మొదటి తేదీన వాటిని తెరిచి సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బహిరంగ మలమూత్ర విసర్జనకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రముఖుల జీవిత చరిత్రలను చదివించాలని, గణితం, సైన్స్లో పట్టు సాధించేందుకు ఖాన్ అకాడమీ వేదికను వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఏడాది జిల్లా నుంచి రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ బాసరకు ఎంపిక కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య రెండూ సమానంగా అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు డిమాండ్ పెరగడం ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాల, విద్యా క్యాలెండర్ అమలు ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని కొనియాడారు. మోడల్ స్కూల్లో సీసీ రోడ్డు , బోర్వెల్ సదుపాయాలు కల్పించడంతో పాటు అన్ని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో మంచినీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ చూపుతున్న చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటు కోసం కృషి చేస్తానని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పాక్సో చట్టం క్యాలెండర్ ను ఆవిష్కరించడంతో పాటు పోషకాహార తోటను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, తహశీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, ఎంఈఓ రాంకిషన్, అకడమిక్ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, స్థానిక సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అంతర్రాష్ట్ర దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

- 12 మంది అరెస్ట్.. ముఠాలో టీజీఎస్పీ కానిస్టేబుల్, రిజర్వ్ ఏఎస్సై
- రూ.17.60 లక్షల నగదు స్వాధీనం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన అంతర్రాష్ట్ర దొంగనోట్ల ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో 12 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించగా, మరో ఇద్ద రు పరారీలో ఉన్నట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. గురువారం సత్తుపల్లి ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సత్తుపల్లి సీఐ టి. శ్రీహరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సత్తుపల్లి, గంగారం ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్న ముఠాపై నిఘా పెట్టి సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా విశ్లేషణ, గూఢచారి సమాచారంతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో ముఠాలో టీజీఎస్పీ 15వ బెటాలియన్కు చెందిన ఓ కానిస్టేబుల్, రిజర్వ్ ఏఎస్సై సభ్యులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు తమను పోలీసు అధికారులమని పరిచయం చేసుకుని నకిలీ దాడులు నిర్వహిస్తూ ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేసేవారు. అలాగే "మీ డబ్బును రెట్టింపు చేసి ఇస్తాం" అంటూ నమ్మించి భారీ మొత్తాల్లో మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నకిలీ కరెన్సీ కట్టలను చూపించి బాధితులను మోసం చేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదుతో పాటు రెండు ఇన్నోవా, ఒక ఎర్టిగా, ఒక ద్విచక్ర వాహనం, 16 సెల్ఫోన్లు, పోలీస్ యూనిఫాంలు, సంకెళ్లు, నకిలీ కరెన్సీ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సామగ్రిని నకిలీ దాడులు, మోసాలకు ఉపయోగించినట్లు తెలిపారు. ఈ ముఠా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా మోసాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నామని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పేర్కొన్నారు. నకిలీ కరెన్సీ మూలాలు, ముఠా కార్యకలాపాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసుల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగినా, డబ్బును రెట్టింపు చేస్తామని ఆశ చూపినా ప్రజలు నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసును ఛేదించిన ప్రత్యేక పోలీసు బృందాన్ని అభినందించారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే సమరశీల పోరాటాలు

- ఈనెల 10న రాష్ట్ర వ్యాప్త ంగా విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి

**ఉద్యమ కెరటం, హన్మకొండ:** రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న కేజీ నుంచి పీజీ వరకు అన్ని విద్యాసంస్థల బంద్కు పిలుపునిచ్చినట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు బంద్కు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. హన్మకొండ ప్రెస్క్లబ్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఏఐఎఫ్డీఎస్ జిల్లా కార్యదర్శి మాస్ సావిత్రి, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శులు బొక్క నరసింహరావు, మర్రి మహేష్, ఏఐఎస్బీ జిల్లా కన్వీనర్ సతీష్, ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సేవలు అందించాలని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు మహిళా విద్యార్థుల భద్రత కోసం ప్రతి విద్యాసంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం అనంతరం బంద్కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జస్వంత్, అజయ్, యూసఫ్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.





# యూటర్న్ తీసుకున్న బంగారం ధరలు..

**హైదరాబాద్, జూలై 2:** రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. కనిష్ఠ స్థాయిలో కొనుగోళ్లు పెరగడంతో పసిడికి డిమాండ్ పెరిగి ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. అదే సమయంలో వెండి ధర కూడా కిలోకు రూ.5 వేల మేర పెరిగింది. గురువారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,550గా నమోదైంది. బుధవారంతో పోలిస్తే రూ.3,770 పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,500కు చేరగా, ఇది గత ధర కంటే రూ.3,450 అధికం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లో బంగారం ధరలు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,180గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,44,700, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,44,550గా నమోదైంది. మరోవైపు వెండి ధరలు కూడా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరుకుంది. బుధవారంతో పోలిస్తే కిలోకు రూ.5 వేల పెరుగుదల నమోదైంది. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆసక్తి పెరగడం వల్ల బంగారం, వెండి ధరలు మళ్లీ పైబాట పట్టినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు..

### వారం రోజుల్లోనే భారీ పెరుగుదల



**హైదరాబాద్, జూలై 2:** తెలుగు రాష్ట్రాల్లో చికెన్, కోడిగుడ్ల ధరలు గత వారం రోజులుగా భారీగా పెరుగుతున్నాయి. ధరల పెరుగుదలతో మధ్యతరగతి కుటుంబాలు, నాన్‌వెజ్ ప్రియులపై అదనపు భారం పడుతోంది. ముఖ్యంగా వారాంతంలో చికెన్ కొనుగోలు చేయాలంటే వినియోగదారులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వారం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.280 నుంచి రూ.300 మధ్య ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.330 వరకు విక్రయిస్తున్నారు. విజయవాడలో కూడా కిలో చికెన్ ధర రూ.320 నుంచి రూ.330 వరకు చేరింది. కొన్ని రిటైల్ దుకాణాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం ఒక్క గుడ్డు రూ.6 నుంచి రూ.7 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.8కు చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే ధర దాదాపు రూ.240కు చేరుకుంది. ధరల పెరుగుదలకు పలు కారణాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలు పెరగడంతో ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. అలాగే మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ వ్యయం కూడా అధికమైందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పలువురు రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించినట్లు సమాచారం. సరఫరా తగ్గడం, డిమాండ్ కొనసాగడం వల్ల చికెన్, కోడిగుడ్ల ధరలు ప్రస్తుతం పెరిగిన స్థాయిలోనే కొనసాగుతున్నాయని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో ఇంధన ధరలు స్థిరం

**హైదరాబాద్, జూలై 2:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇండియన్ ఆయిల్ భారత్ పెట్రోలియం , హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ఇంధన ధరలను సమీక్షిస్తాయి. గ్లోబల్ క్రూడాయిల్ ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా ఖర్చులు, కేంద్ర ఎక్సైజ్ సుంకం, రాష్ట్ర ప్రభుత్వాల వ్యాట్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరలను నిర్ణయిస్తారు. ప్రస్తుతం తెలంగాణలోని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి నగరాల్లో కూడా ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51, డీజిల్ ధర రూ.105.20గా ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలు వంటి నగరాల్లో కూడా స్థానిక పన్నుల ప్రభావంతో స్వల్ప తేడాలు మినహా ధరల్లో ఎలాంటి మార్పు లేదు. 2017 నుంచి అమల్లో ఉన్న డైలీ డైనమిక్ ప్రైసింగ్ విధానం ప్రకారం ప్రతిరోజూ ఇంధన ధరలను సవరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వచ్చే మార్పులను వెంటనే దేశీయ వినియోగదారులకు చేరవేయడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు స్థిరంగా ఉండటంతో దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా యథాతథంగా కొనసాగుతున్నాయి.

# బీఎల్వోల 'ఇష్టారాజ్యం'.. ఓటర్లపై 'హుకుం'!

### ఇంటింటికీ వెళ్లాల్సింది పోయి.. 'మా వద్దకే రావాలంటూ' బరితెగింపు!

### నేరడిగొండలో అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న ప్రజలు

**ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటరు జాబితా సవరణ, ఎన్యూమరేషన్ ప్రక్రియ నేరడిగొండ మండలంలో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బూత్ స్థాయి అధికారులు (బిఎల్వోలు) నేరుగా ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి ఫారాలు అందించి, వివరాలు సేకరించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా నడుస్తోంది. బాధ్యతాయుతమైన విధుల్లో ఉ ఒడి ప్రజాస్వామ్య ప్రక్రియను విజయవంతం చేయాల్సిన కొందరు బిఎల్వోలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, ఓటర్లనే తమ వద్దకు వచ్చి ఫారాలు తీసుకోవాలని హుకుం జారీ చేస్తుండడం స్థానికంగా తీవ్ర విస్మయాన్ని, ఆగ్రహాన్ని గురిచేస్తోంది.**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటరు జాబితా సవరణ, ఎన్యూమరేషన్ ప్రక్రియ నేరడిగొండ మండలంలో అస్తవ్యస్తంగా మారింది. నిబంధనల ప్రకారం బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇంటికి వెళ్లి ఫారాలు అందించి, వివరాలు సేకరించాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బాధ్యతాయుతమైన విధుల్లో ఉండాల్సిన బీఎల్వోలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, ఓటర్లనే తమ వద్దకు వచ్చి ఫారాలు తీసుకోవాలని ఆదేశిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది.

### క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది?

నిబంధనల ప్రకారం, బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలి, చిరునామా మార్పులు లేదా కొత్త ఓటర్ల దరఖాస్తులను (ఫారాలు) అందజేయాలి. అయితే నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లడం మానేశారు. ఎవరైనా వివరాల కోసం అడిగితే, తాము కూర్చున్న చోటికే వచ్చి ఫారాలు తీసుకోవాలని ఖరాఖండిగా చెబుతున్నట్లు సమాచారం. దీనివల్ల వృద్ధులు, మహిళలు, నిత్యం పనులకు వెళ్లే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### ఎవరిది బాధ్యత?

మండల స్థాయి ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో బీఎల్వోల పనితీరును పర్యవేక్షించడంలో విఫలమయ్యారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### బీఎల్వోల నిర్లక్ష్యం!

ప్రభుత్వ విధులను బాధ్యతగా భావించాల్సిన బీఎల్వోలు, తమ పనిని సులభతరం చేసుకునేందుకు ఓటర్లపై భారం వేయడం ఎంతవరకు సమంజసం? అని పలువురు మండల వాసులు ప్రశ్నించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారులు స్పందించి, నేరడిగొండ మండలంలో జరుగుతున్న ఈ అక్రమ 'ఎన్యూమరేషన్' ప్రక్రియపై విచారణ జరిపించి, ప్రతి ఇంటికి బీఎల్వోలు వెళ్లి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# బతికుండగానే 'చంపేశారు'

### అధికారుల ఘోర నిర్లక్ష్యం!

### కళ్లముందే తిరుగుతున్నా రికార్డుల్లో 'డెడ్'..

### వృద్ధుడి ఆసరాను లాగేసుకున్న వైనం!




"నేను బ్రతికే ఉన్నాను సామీ.. నా ఆధార్ కార్డ్, ఓటర్ కార్డ్ అన్నీ ఉన్నాయి. కళ్లముందే తిరుగుతున్నా నన్ను కాగితాల్లో చంపేశారు!"

కన్నీరుమున్నీరవుతూ వృద్ధుడు మధుకర్ ఆవేదన.

**ఉద్యమ కెరటం, కెరమెరి ( కిరణ్) :** ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది..! బల్ల కింద చేతులు నైతేనే కదిలే ఫైళ్లు.. పేదల జీవితాలను ఎలా రోడ్డున పడేస్తాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. నిరుపేద వృద్ధులకు ఆసరాగా నిలవాల్సిన పెన్షన్, అధికారుల కళ్ళు మూసుకుపోయిన తప్పుల వల్ల ఓ వృద్ధుడిని బ్రతికుండగానే 'పీనుగు'ను చేసింది. "నేను బ్రతికే ఉన్నాను మహాప్రభో.." అంటూ ఆ ముసలి ప్రాణం కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా, కనికరించే నాథుడే కరువయ్యాడు..!లి

### 'మధుకర్' కథ చదివితే కన్నీళ్లు ఆగవు!


కోట పరందోలి గ్రామానికి చెందిన గయక్వాడ్ మధుకర్ అనే వృద్ధుడు గత కొన్నేళ్లుగా ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాడు. ఆ వచ్చే కాస్తో కూస్తో పైసలతోనే కడుపు నింపుకుంటున్నాడు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా ఆయనకు రావాల్సిన పెన్షన్ అకస్మాత్తుగా ఆగిపోయింది. కడుపు ఆకలి తట్టుకోలేక, ఎందుకు పెన్షన్ రావడం లేదని ఎంపీడీవో కార్యాలయంలో విచారించగా.. అక్కడ తెలిసిన నిజానికి ఆ వృద్ధుడి గుండె ఆగినంత పనైంది! పెన్షన్ రికార్డుల్లో ఆయన పేరు పక్కన 'చనిపోయినట్లు' నమోదు చేశారు అధికారులు.

సాక్ష్యాలు చేతిలో ఉన్నా కదలని 'అధికార' యంత్రాంగం!

తాను సజీవంగానే ఉన్నానంటూ తన ఆధార్ కార్డు, పెన్షన్ పాస్‌బుక్, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులను చేతపట్టుకుని ఆ వృద్ధుడు ఎంపీడీవో ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నాడు. కళ్లముందే మనిషి కనిపిస్తున్నా, అధికారులు మాత్రం "సాంకేతిక కారణాలు" అంటూ సాకులు చెప్తూ కాలయాపన చేస్తున్నారు తప్ప, తప్పును సరిదిద్దే ప్రయత్నం చేయడం లేదు. ఈ నిర్లక్ష్యపు తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై స్థానిక ఎంపిడిఓ కు వివరణ కోరకు ఉద్యమ కెరటం విలేకరి ఫోన్ చేయగా ఫోన్ కలవలేదు. అయితే సంబంధిత శాఖ జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కు సంప్రదించగా గతంలో అధికారులు చేసిన తప్పుకు ఏం చేయలేమని సమాధానం ఇచ్చారు.

### కలెక్టర్ గారూ.. ఇప్పటికైనా కళ్ళు తెరవండి!

కాగితాల్లో మనిషిని చంపేసిన ఘనత వహించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రికార్డుల్లోని తప్పులను తక్షణమే సరిదిద్ది మధుకర్‌ను 'సజీవుడు'గా గుర్తించాలనీ, గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన పెన్షన్ మొత్తాన్ని వడ్డీతో సహా ఆ వృద్ధుడికి తక్షణమే మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఒక పేదవాడి నోటి కాడి కూడు లాగేసుకున్న ఈ నిర్లక్ష్యపు అధికారులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి!



# శ్రీలంకలో టీమిండియా పర్యటన

■ ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్



**కొలంబో:** టెస్టు సిరీస్ కోసం టీమిండియా జట్టు శ్రీలంకలో పర్యటించనున్నది. ఆగస్టు 15 నుంచి 27వ తేదీ మధ్య ఇరు జట్లు రెండు టెస్టుల్లో తలపనున్నాయి. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్ నిర్వహిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. గాలేలో తొలి టెస్టు, కొలంబోలో రెండో టెస్టును వేదికగా ఫిక్స్ చేశారు. ఆగస్టు 15వ తేదీన గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో తొలి టెస్టు ప్రారంభంకానున్నది. ఆగస్టు 23వ తేదీ నుంచి కొలంబో స్టేడియంలో రెండో టెస్టు ఆడనున్నారు. గతంలో రెండు సార్లు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. డబ్ల్యూటీసీ టైటిల్‌ను ఇండియా గెలవలేకపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ రేసులో టీమిండియా జట్టు అయిదో స్థానంలో ఉన్నది. ఆ తర్వాత శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. ఇక నవంబర్-డిసెంబర్ నెలల్లో న్యూజిలాండ్‌లోనూ ఇండియా పర్యటించనున్నది. శుభమన్ గిల్ నేతృత్వంలోని భారత టెస్టు జట్టు ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2-2 తేడాతో డ్రా చేసుకున్నది. వెస్టిండీస్‌తో జరిగిన హోం సిరీస్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. అయితే గత ఏడాది స్వదేశీ గడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ ఘోర పరాభవాన్ని చవిచూసింది. 2017లో చివరిసారి శ్రీలంకలో భారత్ పర్యటించింది. 9 ఏళ్ల గ్యాప్ తర్వాత లంకలో టీమిండియా టెస్టు సిరీస్ ఆడనున్నది. గత సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో గెలుచుకున్నది.



# నయనశ్రీకి మూడు స్వర్ణాలు


**హైదరాబాద్:** తెలంగాణ స్కేటర్ తళ్లూరి నయనశ్రీ డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్య పతకంతో మెరిసి వరుసగా ఐదోసారి నేషనల్ చాంపియన్‌గా నిలిచింది. మహిళల 500 మీటర్ల ఈవెంట్‌ను 49.467 సెకండ్లలో, 1000 మీటర్ల పోటీని 1 నిమిషం 47.386 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకాలు నెగ్గిన యంగ్ స్కేటర్ జూనియర్ మహిళల 1500మీ. పోటీలోనూ అగ్రస్థానంతో స్వర్ణం అందుకుంది. 3000 మీటర్ల మిక్స్‌డ్ రిలే ఈవెంట్‌లో తెలంగాణకు కాంస్యం అందించింది.

# ఇంగ్లండ్ సిరీస్‌కు కోహ్లీ ముమ్మర సన్నద్ధత

## సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ



**ముంబై, జూలై 2:** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం ముమ్మరంగా సిద్ధమవుతున్నాడు. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో కోహ్లీ ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ చేస్తుండగా, ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇంగ్లండ్ సిరీస్‌లో కోహ్లీ రీఎంట్రీపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ కీలక సిరీస్ కోసం కోహ్లీ ఇప్పటికే ముంబై, అలీబాగ్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని పూర్తి చేశాడు. బ్యాటింగ్ టెక్నిక్‌లో అవసరమైన మార్పులు చేసుకుంటూ, ఫామ్‌ను మరింత మెరుగుపర్చుకునే దిశగా సాధన చేస్తున్నాడు. జూలై 14 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో కోహ్లీకి చోటు దక్కినప్పటికీ, తుది జట్టులో అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంది. టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ ఇకపై పూర్తిగా వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కోహ్లీ పునరాగమనంపై అభిమానులతో పాటు ఆయన చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ సిరీస్‌లో చివరి వన్డే మ్యాచ్‌ను లార్డ్స్ మైదానంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కోహ్లీ నెట్ ప్రాక్టీస్ వీడియోలు ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.



# సెరెనా, ఆండ్రీవా ఔట్

**లండన్:** నాలుగేండ్ల తర్వాత వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో రీఎంట్రీ ఇచ్చిన అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌కు షాక్ తగిలింది. తను తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటిదారి పట్టగా.. ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ మిరా ఆండ్రీవాకు రెండో రౌండ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఐదో సీడ్ రష్యా స్టార్ ఆండ్రీవా 6-4, 5-7, 4-6తో బార్బోరా క్రెజికోవా (చెక్) చేతిలో పోరాడి ఓడింది. టాప్ సీడ్ సబలెంకా (బెలారస్) 6-1, 7-6 (11/9)తో కెస్లెర్ (అమెరికా)పై, నాలుగో సీడ్ పెగులా (అమెరికా) 7-6 (8/6), 6-1తో సోరిబెస్ (స్పెయిన్)పై గెలిచారు. ఏడో సీడ్ గాఫ్ (అమెరికా) 6-3, 3-6, 7-6 (10/7) తో సియెరా (అర్జెంటీనా)పై, 14వ సీడ్ ఒసాకా (జపాన్) 6-3, 6-2తో గసనోవా (రష్యా)ను ఓడించి మూడో రౌండ్ చేరారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన తొలి రౌండ్‌లో 44 ఏండ్ల సెరెనా 3-6, 7-6 (8/6), 3-6తో మాయా జాయింట్ (ఆస్ట్రేలియా) చేతిలో మూడు సెట్ల పాటు పోరాడి ఓడిపోయింది. కాగా, పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో వరల్డ్ నంబర్ వన్ సినర్ (ఇటలీ) 7-6 (7/4), 7-6 (7/2), 6-4తో నునో బోర్గెస్ (పోర్చుగల్)ను వరుస సెట్లలో ఓడించగా.. 8వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 3-6, 6-3, 7-5, 6-2తో అగైలర్ (స్పెయిన్)పై నెగ్గాడు.

# లాస్ ఏంజిల్స్‌లో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం




**లాస్ ఏంజిల్స్, జూలై 2:** బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం సాకారమైంది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తాను ఎప్పటినుంచో కంటున్న కల అని అన్నారు. పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో నిర్మించిన ఈ స్టేడియంలో జూలై 1న మేజర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించారు. దీంతో తమ సొంత దేశం వెలుపల అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, ఒకప్పుడు కలగా మొదలైన ఈ ప్రాజెక్టు నేడు నిజమైందని అన్నారు. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇది కేవలం క్రికెట్ మైదానం మాత్రమే కాదని, సమాజం, వినోదం, కుటుంబాల కోసం రూపొందించిన ప్రత్యేక వేదిక అని చెప్పారు. ఈ స్టేడియాన్ని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షాతో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో కేవలం 100 రోజుల్లోనే ఈ మైదానాన్ని నిర్మించామని వెల్లడించారు. ప్రస్తుతం 5,000 మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ స్టేడియాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000 సీట్ల సామర్థ్యానికి విస్తరించనున్నట్లు తెలిపారు. టీ20 క్రికెట్ ఒలింపిక్స్ వేదికగా ఈ మైదానం నిలిచే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇషాన్@1

**దుబాయ్:** ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకుల్లో భారత వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. సుమారు ఏడాదిపాటు ఈ స్థానంలో ఉన్న డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మను వెనక్కినెట్టి ఇషాన్ ఫస్ట్‌ప్లేస్‌కు దూసుకొచ్చాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలోనే జరిగిన టీ20 ప్రపంచకప్‌లో 317 రన్స్ చేసిన ఇషాన్.. 876 రేటింగ్ పాయింట్లతో మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా అభిషేక్ (869) రెండో స్థానానికి పడిపోయాడు.



# హార్దిక్ ట్రేడ్‌పై సీఎస్‌కే క్లారిటీ

## ఇప్పటివరకు ఎలాంటి చర్చలు లేవు






చెన్నై, జూలై 2: ఐపీఎల్ 2026 సీజన్ అనంతరం ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌పై జోరుగా వినిపిస్తున్న ఊహాగానాలపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) స్పందించింది. హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకొచ్చే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు సీఎస్‌కే, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాశీ విశ్వనాథన్ తెలిపారు. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాతే జట్టుపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాతే ట్రేడింగ్ వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న ఎంఎల్‌సీ టోర్నీ జూలై 18తో ముగియనుంది. ఇదిలా ఉండగా, గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమవుతోంది. 2025లో చివరి స్థానంలో నిలిచిన చెన్నై, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో జట్టులో నాయకత్వ మార్పు అవసరమనే చర్చలు జరుగుతున్న నేపథ్యంలో హార్దిక్ పాండ్యా పేరును పలువురు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు, కొన్ని మీడియా కథనాల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగతా ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం హార్దిక్ ట్రేడింగ్ వ్యవహారం ఊహాగానాలకే పరిమితమైంది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
3 జూలై 2026



# లయ ఫిట్‌నెస్ సీక్రెట్

సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న నటి లయ తన ఫిట్‌నెస్ రహస్యాలను వెల్లడించారు. ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన లయ, ఫిట్‌నెస్ అనేది కేవలం అందం కోసమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమని చెప్పారు. పెళ్లి, పిల్లల తర్వాత చాలా మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారని, తాను కూడా ఒక దశలో అలాగే ఆలోచించానని తెలిపారు. వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, శారీరకంగా చురుకుగా ఉంటే వృద్ధాప్య ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేకపోతే వ్యాధులు త్వరగా వస్తాయని హెచ్చరించారు. జిమ్‌లో వ్యాయామం చేయడం కంటే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం డ్యాన్స్ చేయడం తనకు ఎక్కువ ఉత్సాహాన్ని ఇస్తుందని లయ చెప్పారు. తన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేయడం వల్ల శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని వివరించారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని లయ సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, చురుకైన జీవనశైలిని అలవర్చుకోవడం వల్ల ఎక్కువకాలం ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపించవచ్చని ఆమె తెలిపారు.

# దసరాకు విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.




# త్రిష రాజకీయాల్లోకి వస్తారా?


## తిరుచ్చి ఉపఎన్నికపై జోరుగా ప్రచారం

స్టార్ హీరోయిన్ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాడులో జోరుగా ప్రచారం సాగుతోంది. తిరుచ్చి అసెంబ్లీ ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున ఆమెను బరిలోకి దించే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించిన అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. తొలుత ఈ స్థానంలో నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలున్నాయని ప్రచారం జరిగినా, ఆయన తప్పుకోవడంతో కొత్త అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిష పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమెను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీ యోచిస్తోందా అనే చర్చలు సాగుతున్నాయి. అయితే త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఈ ప్రచారంపై స్పందించలేదు. దీంతో ప్రస్తుతం ఇవన్నీ ఊహాగానాలుగానే మిగిలాయి. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే త్రిష వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన 'కరుప్పు' విజయంతో మంచి జోష్‌లో ఉన్న ఆమె, త్వరలో 'విశ్వంభర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే మరికొన్ని కొత్త చిత్రాలకు కూడా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. నటిగా వరుస విజయాలతో పాటు కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ త్రిష తన జోరును కొనసాగిస్తోంది.



# నేడు థియేటర్లలోకి నాగబంధం

## హిందీ వర్షన్‌కు బై వన్ గెట్ 2 ఆఫర్




పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్‌కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుకలాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

# సెన్సార్ నుంచి బటయపడని జననాయగన్

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్బే దయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల్', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**